







విరాళాలు ధారాళంగా!

ప్రత్యేక కథనం

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఏటేటా భక్తుల సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. దీనికి అనుగుణంగా అనేక అన్నదానం, వసతి, సేవా కార్యక్రమాలను విస్తరించాల్సి వస్తోంది. దీనికి ప్రధానంగా దాతలే అండగా నిలుస్తున్నారు. కోట్లాది రూపాయల విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. అన్నదానం పెద్దఎత్తున సాగడానికి, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించే సత్రాలు, కల్యాణ మండపాలను నిర్మించి అందుబాటులోకి తెస్తున్నారు. 4

దీవించు..సుబ్రహ్మణ్యేశ్వరా!



దేవరపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి బారులుతీరిన భక్తజనం.. బిక్కవోలులో స్వామి ఊరేగింపు

జిల్లా వ్యాప్తంగా షష్ఠి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు.. బిక్కవోలు, రాజానగరం, దేవరపల్లి, ఉండ్రాజవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం, కోరుకొండ తదితర మండలాల్లో ఆలయాల వద్ద జనం బారులు తీరారు.. దీవించరా.. సుబ్రహ్మణ్యేశ్వరా అంటూ మొక్కుకున్నారు.. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. బిక్కవోలు వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనంపోటెత్తారు.. - వివరాలు 4,6లో

ఇన్‌స్టాలో పరిచయం.. మోసపోయిన బాలిక

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ప్రేమగా మారింది.. ఎవరో తెలియకుండానే దగ్గరైంది.. చివరికి మోసపోయానని తెలుసుకుని ఒక బాలిక పోలీస్‌స్టేషన్ బాట పట్టింది. కొవ్వూరు మండలానికి చెందిన బాలిక(16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది.ఏడు నెలల కిందట పోలవరానికి చెందిన వీరేంద్రతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో తరచుగా చాటింగ్ చేసుకునేవారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక ఇంటికి వచ్చి 4 సార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అనంతరం ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. ఈ నెల 5వ తేదీన బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించి ఆరు నెలల గర్భిణీ అని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక కడుపులో పిండం ఎదుగుదల సరిగా లేకపోవడంతో వైద్యులు గర్భాన్ని తొలగించి బాధితురాలికి చికిత్స అందించారు. బాలిక ఫిర్యాదు మేరకు వీరేంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నేటి నుంచి మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు (ఔట్ సోర్సింగ్) కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళుతున్నారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుబాబు, సర్వేశ్వరరావు యూనియన్ నాయకులు ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసును కలిసి వినతిపత్రం అందించారు. సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ వర్కర్లకు రూ.29,200, నాన్‌టెక్నికల్ వర్కర్లకు రూ.24500 జీతం ఇవ్వాలనే ఆరు డిమాండ్లలో సమ్మె చేస్తున్నామని వారు ప్రకటించారు.

లాయర్లతో పోలీస్ మీట్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం న్యాయవాదులతో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లకు కోర్టుల్లో రిమాండ్ అంశాలపై తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు అవగాహన కల్పించారు.అరెస్టులు, రిమాండ్‌లు తదితర అంశాలపై కోర్టు కానిస్టేబుళ్లకు స్పష్టత ఇచ్చారు.కానిస్టేబుళ్లు వారి సందేశాలను నివృత్తి చేసుకున్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి న్యాయమూర్తి ప్రకాష్‌బాబు, రిటైర్డ్ పీపీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఫ్లాగ్ డే నిధికి ప్రతి ఒక్కరు తమ వంతుగా విరాళాలు సేకరించి జమచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ డే విరాళాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ ప్రారంభించారు.క్యూఆర్ కోడ్ విడుదల చేశారు. దేశ రక్షణలో సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రతి ఏటా డిసెంబరు 7 నుంచి దేశ వ్యాప్తంగా ఫ్లాగ్ డే నిర్వహించుకుంటున్నామన్నారు. దేశం కోసం ,ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు,విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు ఎదురొడ్డి సేవలందించే సాయుధ దళాలకు మనవంతం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విరాళాలను జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరున ఎస్‌బీఐ జిల్లా పరిషత్ శాఖ కాకినాడ బ్రాంచ్, ఖాతా నెంబరు 62064060626, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐ ఎన్‌వో 0020974కు నేరుగా జయచేయవచ్చని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.చిన్న వెంకట్రావు,జిల్లా మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కలెక్టర్‌తో సెల్ఫీ

బడికి..పండగొచ్చింది!

అమ్మా..నాన్నా వచ్చారు.. అన్నీ తెలుసుకున్నారు..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పాఠశాలలకు పండుగొచ్చింది..జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులకు కొత్త కళొచ్చింది.. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' విజయవంతమైంది. పిల్లలు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు శనివారం అంతా కలిసి పండుగ చేసుకున్నారు. ఒకరి సమస్యలు ఒకరు చెప్పుకున్నారు.. ఒకరి సమస్యలు మరొకరు తెలుసుకున్నారు. తమ పిల్లలు పాఠశాలల్లో ఎలా ఉంటున్నారో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. మార్పు ఎలా తేవాలనే దానిపై ఇరువురూ కలిసి చర్చించుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నెలకోమారు ఇలా కలుసుకుంటుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 714 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 202 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 988 పాఠశాలలు సందడి మారాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆహ్వానం మేరకు తల్లిదండ్రులు /సంరక్షకులు పండుగకు భారీగా తరలివచ్చారు. బాలురు 49348, బాలికలు 54074 మంది..వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు,ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు సుమారు రూ. 3 లక్షల మంది వేడుకలకు హాజరయ్యారు. మీటింగ్ నిర్వహణకు ప్రభుత్వం రూ.23 లక్షల నిధులు విడుదల చేసింది. ప్రతి పాఠశాలలోనూ ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులకు రంగోళి పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ (తాడు లాగడం) పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. కొన్ని చోట్ల విద్యార్థులతో పాటలు పాడించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ , గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాల్సిన అవసరాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా విద్యార్థుల తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగెస్ రిపోర్టులు అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పాఠశాలలో ఆనందంగా గడిపారు. తమ పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఏం చేయా లో తెలుసుకున్నారు. పాఠశాలల్లో విందు ఆరగించి ఆనందంగా ఇళ్లకు వెళ్లారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జడ్పీ హైస్కూల్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి స్వయంగా భోజనం చేసి రుచిగా ఉండడంతో ఇద్దరు ఆయాలను మెచ్చుకుని.. వారికి మంచి చీరలు బహూకరించాలని డీఈవో వాసుదేవరావును ఆదేశించారు.లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లో జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు హాజరై చిన్నారులకు తమ అనుభవాలను అందించారు. బాగా చదువుకోవాలని సూచించారు. మేం బాగా చదువుకున్నాం కాబట్టే ఈ రోజు మీకు చెప్పగలిగే స్థాయికి ఎదిగామని.. మీరు కూడా మాలా ఎదగాలని సూచించారు.జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవోలు కృష్ణనాయక్,రాణి సుస్మిత, మండల స్థాయి అధికారులు తదితరులు హాజరయ్యారు. విద్యార్థులతో పాటు వారి తల్లులు ఎక్కువగా హాజరుకావడం గమనార్హం.



కొవ్వూరులో విద్యార్థుల తల్లులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

- ఘనంగా మెగా పేరెంట్స్ మీట్
- 988 పాఠశాలల్లో నిర్వహణ
- తల్లులకు రంగవల్లుల పోటీలు
- తండ్రులకు టగ్ ఆఫ్ వార్
- ఉత్సాహంగా సాగిన మీటింగ్
- హాజరైన కలెక్టర్, అధికారులు
- బడిలోనే తల్లిదండ్రులకు విందు
- ప్రతి నెలా ఉండాలన్న పేరెంట్స్

ఇక నుంచి ప్రభుత్వ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డ్ : కలెక్టర్

కొవ్వూరు,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరేంట్స్ సమావేశాలు నిర్వహించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరేంట్స్ సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాల పరిస్థితులను, ఉపాధ్యాయుల పనితీరు అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజ నం చేశారు. చక్కగా వంట చేసిన మిడ్ డే మీల్ ఆయాలను ప్రశంసించి వారికి చీరలను బహూకరించారు. పిల్లల చదువులపై తల్లిదండ్రుల్లో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. చదువుతో పాటు వారి ప్రతిభను తెలియజేసే సమగ్ర ప్రగతి ప్రోగ్రెస్ కార్డు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.ఇంతవరకు ఈ విధా నం ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే ఉందన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గమనిస్తూ ప్రోగ్రెస్ కార్డులపై తల్లితండ్రులు సంతకాలు చేసి పంపించాలన్నారు. రెండు రోజులకోసారి భోజనంలో మెనూ మార్చాలని..పాఠశాలలో శిథిలావస్థకు చేరిన షెడ్డును తీసివేసి ఆటస్థలంగా మార్పు చేయాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు.ఆమె వెంట డీఈవో కె.వాసుదేవరావు,ఎంఈవో కె.రామకిషోర్, హెచ్‌ఎం టి.రామానుజం, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



లాలాచెరువు మునిసిపల్ పాఠశాలలో విద్యార్థుల ఆవిష్కరణలు తిలకిస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా..

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :ప్రతి విద్యార్థి పట్టుదలతో తాను ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థితికి చేరాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంచడం చాలా ముఖ్యమన్నారు. తాను కూడా పదవ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలోనూ ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నదని, తల్లిదండ్రులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా బోధన, ఇతర విషయాల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై తల్లిదండ్రులు అందించే సూచనలు కీలకపాత్రను పోషిస్తాయన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, నేరాల వైపు విద్యార్థుల దృష్టి మరలకుండా ఉపాధ్యాయు లు చూడాలన్నారు. ముందుగా జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ ప్రశాంతి తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.పేరెంట్స్‌కు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కే. ప్రకాష్‌బాబు,డీఈవో కె.వాసుదేవరావు, డీఐవో దిలీప్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ కందికొండ రమేష్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.





కొవ్వూరులో ఆయాలకు చీరల బహుమానం.. కోరుకొండలో తల్లులకు గిఫ్ట్‌గా స్టీల్ బాక్స్‌లు



రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు

గాలి..పీల్చలేం!

రాజమహేంద్రవరంలో వాయుకాలుష్యం

- నగరంలో కంపు..కంపు
- పేపరుమిల్లు గ్యాస్‌తో ఇక్కట్లు
- డంపింగ్‌యార్డుతో ఇబ్బంది
- రోగాలతో జనం సహవాసం
- పట్టించుకోని యంత్రాంగం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలను పట్టిపీడిస్తున్న భయంకరమైన సమస్య వాయు కాలుష్యం.రోజూ అలవాటుపడిన ప్రజలకు ఇది పెద్దగా పట్టకపోవచ్చుగాని కొత్తవారు వస్తే మాత్రం కడుపులోతిప్పి వాంతులు కావడం ఖాయం. ఐదు దశాబ్దాలుగా రాజమహేంద్రవరం పరిసర గ్రామాలను పేపరు మిల్లు కాలుష్యం వెంటాడుతోంది. పేపరు మిల్లు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించింది. అయితే అదే స్థాయిలో గోదావరి జల, వాయుకాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడేలా అనేక సమస్యలు సృష్టించింది .గతంలో మిల్లు కాలుష్యంపై ప్రజలు,ప్రజా సం ఘాలు తిరగబడితే జల కాలుష్యం కాకుండా నీటిని శుద్ధిచేసి నదిలోకి వదులుతున్నామని మిల్లు యాజమాన్యం చెప్పింది. అయినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. పదేళ్ల కిందట వరకు పేపరుమిల్లు నుంచి విడుదలయ్యే గ్యాస్‌తో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు.దీనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో మిల్లులోపల ప్రత్యేక ప్లాంట్‌ను పెట్టి గ్యాస్ బయటకు విడుదల కాకుండా చర్యలు తీసుకున్నారు. కానీ గత కొంత కాలంగా మళ్లీ దుర్వాసనతో కూడిన గ్యాస్‌ను విడుదల చేస్తున్నారు. దీంతో ఆ వాసన పడక చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు ఇబ్బం దులు పడుతున్నారు. శ్వాసకోస, చర్మ, కంటి సం బంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. గోదావరి గాలి ఇసురును బట్టి నగరంతో పాటు చు ట్టుపక్కల కాతేరు, కొంతమూరు, కోలమూరు, లాలాచెరువు ప్రాంతాలకు వాసనపోతుంది. కోటి లింగాలపేట, పాత ఊటలంక, లూధర్ గిరి, శ్రీరామ్‌నగర్, లలితానగర్, ఎల్‌బీ శాస్త్రిరోడ్డు, మునిసిపల్ కాలనీ, రత్నంపేట,ఆర్అండ్‌బీ, వాంబేకాలనీ, ఇందిరా నగర్, ఆనంద్‌నగర్,క్వారీ సెంటర్ల వరకు గ్యాస్ వాసన కమ్ముతోంది.శ్వాసకోస సమస్యలు వస్తున్నాయి.



జఠిలంగా మారిన డంపింగ్ యార్డ్

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని వ్యర్థాలు, చెత్త, చెదారాలను కార్పొరేషన్ చెత్త తరలించే వాహనాల్లో స్థానిక లూధర్‌గిరి వెనుక ప్రాంతంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇక్కడ గత 12 ఏళ్లుగా ప్రతిరోజు ఉత్పన్నమవు తున్న 167 మెట్రిక్ టన్నుల చెత్తను తీసుకువచ్చి నిల్వచేసి వాటిని దగ్ధం చేసేవారు.అయితే ఇక్కడ చెత్త గ్రేడింగ్ చేసి రీసైక్లింగ్‌కు తీసుకెళ్లే వాటిని ప్రత్యేకంగా వేరుచేయడం వంటి పనులకు షెడ్డు నిర్మించారు. అక్కడ దానిని చేర్చి ఉన్న పాత డంపింగ్ యార్డులో వ్యర్థాలు కుళ్లిపోయి భయంకరమైన దుర్వాసన వెదజల్లుతూ చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల వరకు దుర్వాసన వస్తోంది. ఈ డంపింగ్ యార్డును తరలించాలని గత పదే ళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.కానీ అది ఆచరణలోకి రాలేదు.ఈ వ్యర్థాలపై పందులు సంచరిస్తూ మరింత దుర్గంధభరితంగా మారుస్తున్నాయి. ఈ డంపింగ్ యార్డు ఒకప్పుడు ఊరి చివర ఉండేది కానీ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ఇప్పుడు ఊరి మధ్యకు వచ్చేసింది. దీంతో ఆర్అండ్‌బీ వాంబేకాలనీ, శ్రీనగర్, మునిసిపల్ కాలనీ ప్రజలు తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.వర్షం పడితే సుమారు రెండు కిలోమీటర్ల మేర కంపు కొడుతుంది.ఈ వ్యర్థాలకు ఈగలు,దోమలు పెరిగి ఏడాది పొడవునా ఈ ప్రాంతంలో పిల్లలు జ్వ రాలు బారిన పడుతున్నారు.రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కాలుష్యం, డంపింగ్ యార్డు దుర్గంధం నడుమ ప్రజలు నలిగిపోతున్నారు.

భరించలేకపోతున్నాం..

అటు పేపరుమిల్లు, ఇటు డంపింగ్ యార్డు రెండింటికి మధ్యలో ఉన్నాం. పేపరుమిల్లు నుంచి మధ్యమధ్యలో గ్యాస్ విడుదలైనప్పుడు భరించలేని వాసన వస్తుంది.. కానీ ఎప్పుడు డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వస్తూనే వుంటుంది. దీని వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. **- అబ్రహాం, లూథర్‌గిరి**

వాసనొస్తే..అన్నం తినలేం

వాయు కాలుష్యం భరించలేకపోతున్నాం. పేపర్ మిల్లు నుంచి గ్యాస్ వాసన వస్తే ఆ రోజు అన్నం తినబుద్ధికాదు. మరొక పక్క కుళ్లిన వ్యర్థాలతో డంపింగ్ యార్డు నుంచి వాసన వస్తుంది.. డంపింగ్ యార్డు దగ్గరగా ఉండడంతో దోమలు పెరిగి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. **నాగేశ్వరరావు పేపరు మిల్లు రోడ్డు ,రాజమహేంద్రవరం**

డంపింగ్ యార్డు, మిల్లుతో ముప్పు

లూథరగిరి వెనుక ఆర్అండ్‌బీ వాంబే కాలనీలో ఉంటున్నాం..మాకు దగ్గరలో డంపింగ్ యార్డు, కూతవేటు దూరంలో పేపరుమిల్లు ఉన్నాయి. ఈ రెండింటితో ఇబ్బందులు పడుతున్నాం. డంపింగ్‌యార్డ్ తరలించాలి..మిల్లు గ్యాస్ విడుదల నియంత్రించాలి. **- పేరూరి రాఘవ, ఆర్అండ్‌బీ వాంబే కాలనీ**

ఎలా బతకాలో అర్థంకావడంలేదు..

డంపింగ్ యార్డు, పేపరుమిల్లు, దోమలు బెడదతో సతమతమవుతున్నాం. సొంతిళ్లను వదిలిపోలేం. చాలా ఏళ్లగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు. సమస్యలు పరిష్కరించండి **- సీహెచ్.రమణ, వాంబే కాలనీ**

ప్రత్యేక కథనం

విరాళాలు.. ధారాళంగా


అన్నదానం సత్రంలో..


శ్రీ లలితా రైస్ వారు నిర్మించిన ప్రసాద తయారీ భవనం

- సత్యదేవుడి ఆలయానికి భక్తుల విరాళాల వెల్లువ
- నిత్యాన్నదాన పథకానికి ప్రారంభం నుంచి ఇప్పటికి 1.50 లక్షలమంది దాతల నుంచి రూ.62కోట్లు
- సత్రం గదుల డొనేషన్‌కు ముందుకొస్తున్న దాతలు
- దాతలకు ప్రత్యేక గుర్తింపుగా సిల్వర్, గోల్డ్, ప్లాటినం కార్డులు జారీ
- వీటి ద్వారా సదరు దాతకు ప్రత్యేక సౌకర్యాల కల్పన



దాతల సహకారంతో నిర్మించిన వసతి కోసం శివ సదన్.. రత్నగిరి డార్మిటరీ


విరాళాల కౌంటర్లు

(ఆంధ్రజ్యోతి- అన్నవరం)

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా.. భక్తితత్వానికి నిలయంగా.. ప్రశాంతతకు ఆలవాలంగా నిలుస్తోంది.. అన్నవరంలోని సత్యదేవుడి పుణ్యక్షేత్రం. రాష్ట్రంలో తిరుపతి తర్వాత ఆ స్థాయిలో ఖ్యాతి గడించిన ఆలయమిది. ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆలయానికి హుండీలతోపాటు దర్శనాలు, వ్రతాలు, సత్రం గదులు, ప్రసాదం, ఆలయ పరిధిలో వివిధ షాపుల వేలం వంటి రూపాల్లో ఆదాయాలు వస్తుంటాయి. ఇదంతా ఒకెత్తు అయితే భక్తుల విరాళాలు ప్రత్యేకం. ఇక్కడికి వచ్చే చాలామంది స్వామికి తమ వంతుగా వివిధ రూపాల్లో విరాళాలు ఇస్తుంటారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలనకు కానుకలతోపాటు దాతల దాతృత్వం కూడా ఎంతో ముఖ్యం. అసలు సత్యదేవుడికి ఎన్ని రూపాల్లో విరాళాలు వస్తుంటాయి. ఎంత వచ్చి ఉంటాయి. ఎన్నిరకాలుగా ఇవ్వొచ్చు... దాతలకు దేవస్థానం కల్పించే సౌకర్యాలు వంటి విశేషాలు తెలుసుకుందాం..

కొండపై ప్రత్యేక కౌంటర్లు

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఎందరో దాతలు తమవంతు సాయమందిస్తూ ఉంటారు. అన్నదానం, గోసంరక్షణ ట్రస్టు, సత్రం గదులకు సంబంధించి దేవస్థానం తరఫున విరాళాలు స్వీకరిస్తుంటారు. వీటికి రత్నగిరిపై ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. అన్నదానానికి సంబంధించి మూడుచోట్ల కౌంటర్లు ఉన్నాయి. గోసంరక్షణ, సత్రం గదులకు కూడా ఏర్పాటు చేశారు. దాతలు వీటిని సంప్రదించి విరాళాలు ఇస్తుంటారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకం

అన్నవరం దేవస్థానంలో అధికంగా సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందిస్తుంటారు. ఈ పథకం 1987లో ప్రారంభం కాగా ఇప్పటివరకు రూ.62 కోట్లు విరాళాలుగా వచ్చాయి. వీటిపై వచ్చే వడ్డీతో ప్రతినిత్యం నిత్యాన్నదానం చేస్తుంటారు. ఇప్పటివరకు ఈ పథకంలో రూ.1116 నుంచి ఆపై విరాళాలు అందించిన దాతల సంఖ్య లక్షా 50 వేలమంది వరకు ఉన్నారు. వీటిపై ఏటా వడ్డీల రూపంలో రూ.4.5 కోట్లు సమకూరుతోంది. కేవలం ఈ వడ్డీతోనే సరాసరిన రోజుకు 4 వేలమందికి ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. వీటిలో రూ.లక్షపైబడి విరాళమిచ్చిన వారికి మాత్రమే కొన్ని వెసులుబాట్లు కల్పిస్తారు. వీరికి మొదటి ఏడాదికి ఒకసారి ఉచితంగా సత్రం గది, ఉచితంగా వ్రతం చేసుకునే అవకాశం, కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్నారు. తదుపరి ఏడాది నుంచి కేవలం ప్రత్యేక దర్శన సౌకర్యం మాత్రమే ఉంటుంది. ఈ నిధులు కేవలం అన్నదాన ట్రస్టుకు చెందుతాయి. ఈ పథకానికి సెక్షన్ 80జీ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. దీనికి రూ.500పైబడి విరాళం ఇవ్వొచ్చు. రూ.లక్షపైబడి డొనేషన్ చేసినవారి పేరు వారు సూచించిన రోజున అన్నదానం వద్ద బోర్డులో ప్రదర్శిస్తారు.

సత్రం గదులకు డొనేషన్లు

దేవస్థానంలో ప్రస్తుతం హరిహరసదన్, శివసదన్ కాటేజీలకు డోనార్ స్కీం అమలవుతోంది. హరిహరసదన్‌లో ఒక రూంకు డోనార్ రూ.5 లక్షలు, శివసదన్‌లో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరి పేరు వీరికి కేటాయించిన సత్రం గదిపై శాశ్వతంగా లిఖిస్తారు. గది డోనార్‌కు ఏడాదిలో 30రోజులపాటు దాతకుగానీ, దాత సిఫార్సు చేసిన వారికిగానీ ఉచితంగా పదేళ్లపాటు కొనసాగిస్తారు. వీరికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దాత 15రోజులు ముందుగా దేవస్థానం సంబంధిత విభాగానికి ఈ సమాచారం చేరవేయాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు వస్తే ఆలయంలో భక్తుల రద్దీని బట్టి ప్రాధాన్య క్రమంలో సత్రం గదులు కేటాయిస్తారు. ఈ విరాళాల ద్వారా వచ్చిన మొత్తం దేవస్థానం మెయిన్ అకౌంట్‌కు జమచేస్తారు. వ్యక్తిగత గెస్ట్‌హౌస్‌లు కూడా విరాళాల జాబితాలో ఉన్నాయి. కొండపై ఉన్న అంజనీ గెస్ట్ హౌస్, రామరాజు నిలయం, పల్లవి గెస్ట్‌హౌస్, సీతానిలయం, సత్యనిలయం, సత్యకిరణ్‌నిలయం, సీతారామసదన్ గెస్ట్‌హౌస్ తదితర ఏడు గెస్ట్‌హౌస్‌లను దాతలు నిర్మించారు. వీరికి ఏడాదిలో 30 రోజులపాటు ఉచితంగా గెస్ట్‌హౌస్ కేటాయిస్తారు. నెలరోజుల తర్వాత కూడా రద్దీనిబట్టి ఈ దాతలు సిఫార్సు చేసినవాళ్లకి వీటిని ఇచ్చే అవకాశం ఉంది. దేవస్థానం పరిధిలోనే కేటాయింపు చేస్తారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు

భక్తులు గోసంరక్షణ ట్రస్టుకు కూడా విరాళాలు అందించవచ్చు. పదేళ్ల కిందట నెలకొల్పిన ఈ ట్రస్టు ద్వారా వచ్చే విరాళాలను గోవుల సంరక్షణ, దాణా తదితర వాటికి వినియోగిస్తుంటారు. ఇప్పటివరకు ఈ ట్రస్టుకు రూ.1.57 కోట్లు విరాళాలుగా వచ్చాయి. దేవస్థానంలో 49 ఆవులు, 23 గిత్తలు, ఎద్దులు 4, పెయ్యిలు 21 ఉన్నాయి. విరాళమిస్తే ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

స్వల్పంగానే అతిపెద్ద డోనార్లు

అన్నవరం దేవస్థానంలో రూ.కోటిపైబడి విరాళాలందించిన వారు స్వల్పంగానే ఉన్నారు. వీరిలో కాకినాడ తిమ్మాపురంలో కర్రి బామిరెడ్డి జమిందారు 45 ఎకరాల భూమిని విరాళంగా అందించారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్ ప్రసాదం తయారీ భవనాన్ని రూ.4 కోట్లతో, స్వామి, అమ్మవార్లకు వజ్రకిరీటం, కర్ణాభరణాలు రూ.3 కోట్లతో, ఇంకా పలు వెండి వస్తువులు, గర్భాలయ బంగారు తాపడం పనులు కూడా చేపట్టారు. రూ.25 లక్షలతో సహస్ర దీపాలంకరణ మందిరం నిర్మించారు. లలిత రైస్ మరో ఎండీ మట్టే శ్రీనివాస్, సత్యశ్రీనివాస ఉచిత కల్యాణవేదికను రూ.4.5 కోట్లతో చేపట్టడంతోపాటు వంశపారంపర్యంగా స్వామివారి నివేదనకు అవసరమయ్యే బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. నిత్యం జరిగే పంచహారతులకు వెండి సామగ్రిని అందించారు. పారిశ్రామికవేత్త ఎంఎస్ రెడ్డి అంజనీ గెస్ట్‌హౌస్, ఉచిత కల్యాణమండపాలను నిర్మించారు. రాజమహేంద్రవరానికి చెందిన పెన్నాడ నాగమణి రూ.2 కోట్లతో ఉచిత డార్మెటరీ నిర్మించారు. అదేవిధంగా మరో ఐదుగురు దాతలు పలు గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు.

విరాళాన్ని బట్టి కార్డులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం అందించే దాతలకు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో దేవస్థానం వారి విరాళాన్ని బట్టి పేర్లు కేటాయించింది. రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు దాతలుగా, రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు పోషకులుగా, రూ.50 వేల నుంచి రూ.లక్షవరకు రాజపోషకులుగా, రూ.లక్ష పైబడి మహారాజపోషకులుగా పరిగణించారు. దీంతోపాటు దాతలకు వారిచ్చిన డొనేషన్ ఆధారంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల దేవస్థానం ప్రత్యేక కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. వీటిలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళం అందించిన వారికి సిల్వర్ కార్డు, రూ.10 లక్షల నుంచి రూ.కోటి విరాళమిచ్చిన వారికి గోల్డ్‌కార్డు, రూ.కోటి ఆపైన డొనేట్ చేసిన వారికి ప్లాటినం కార్డులను జారీ ప్రారంభించింది.

విరాళం అందించాలనుకుంటే..

ఆలయంలో స్వామివారికి విరాళం అందించాలనుకుంటే కొండపై సంబంధిత కౌంటర్‌లో సంప్రదించాలి. నగదు, చెక్కు, డిజిటల్ పేమెంట్ రూపాల్లో విరాళం ఇవ్వొచ్చు. నగదు అయితే రూ.49 వేల లోపు స్వీకరిస్తారు. ఆపైన ఎంత ఇచ్చినా తప్పనిసరిగా పాన్‌కార్డు ఇవ్వాలి. అన్నవరం దేవస్థానం వెబ్‌సైట్‌లోగానీ, యాప్‌గానీ విరాళాన్ని డిజిటల్ పేమెంట్ చేయొచ్చు. ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసిన తర్వాత సంబంధిత పత్రాలతో దేవస్థానాన్ని సంప్రదించి తగిన సౌకర్యాలు పొందొచ్చు.

డోనార్ సెల్ ఏర్పాటు కలగానే..

అన్నవరం దేవస్థానంలో డోనార్ సెల్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా ప్రతిపాదనలు ఉన్నా అవి కలగానే మిగిలిపోతున్నాయి. సాధారణ దాతలకు దేవస్థానం తరఫున సౌకర్యాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి డోనార్ సెల్ ఏర్పాటు చేస్తే విరాళాల తదనంతర సౌకర్యాల కల్పనకు అటూఇటూ తిరగాల్సిన పని ఉండదని దాతలు కోరుతున్నారు.




లలితా రైస్ వారు నిర్మించిన శ్రీ సత్య శ్రీనివాస ఉచిత కల్యాణ వేదిక.. ఎంఎస్ రెడ్డి- అంజని ఉచిత వివాహ వేదిక.. రామరాజు అతిథి గృహం

ఆలయాలు... భక్తజన సంద్రం


తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనాలకు బారులు తీరిన భక్తులు


గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఆలయంలో నిద్రిస్తున్న ఉపవాస దీక్ష చేసిన మహిళలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తజనసంద్రమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తాటిపర్తిలో స్వయంభూ వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయం సమీపంలో ఉన్న పుట్టల వద్ద గుడ్లు, పాలు ఉంచి పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షతో ఉన్న మహిళలు ఆలయ ప్రాంగణంలోనే నిద్రించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ పోలీసుబందోస్తు నిర్వహించారు. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి స్నానాలు జరిగాయి. స్వామికి మహారుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సంతాన ప్రాప్తి కోసం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఆలయాలకు చేరుకుని ఉపవాస దీక్ష కొనసాగిస్తున్నారు. ఉగ్రషష్ఠి మండపంలో నిద్రించారు.

కనుల పండువగా కల్యాణం

తాటిపర్తి, మల్లవరంలో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల కల్యాణం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

బిక్కవోలులో వైభవంగా షష్ఠి వేడుకలు


అలంకారరూపంలో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి వారు

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 1.20 గంటలకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిపూజలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, కుమారుడు మనోజ్‌రెడ్డి పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అప్పటి నుంచి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. సంతానార్థులైన స్త్రీలు స్వామి పుట్టపై ఉంచిన నాగచీరలను ధరించి ఆలయం వెనుక నిద్రించారు. ఉదయం 8.10 గంటలకు స్వామివారిని మయూర వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆలయ ఆవరణలో దొడ్డిపట్ల, మొగల్తూరు, ఉండ్రాజవరం, బిక్కవోలు వారు నిర్వహించిన బ్యాండు కచేరీలు కనువిందు చేశాయి. 4 నుంచి 5వరకూ కాల్చిన బాణసంచా భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో పూలు, పండ్ల డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : మంత్రి

షష్ఠి సందర్భంగా స్వామివారికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టెంపుల్ సర్క్యూట్ ప్రాజెక్టులో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్వామిని దర్శించుకున్న ప్రముఖుల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కేపీఆర్ సంస్థల డైరెక్టర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎస్పీ నరసింహకిషోర్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

ఎ.వేమవరంలో ప్రత్యేక అభిషేకాలు

అమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఎ.వేమవరంలో ప్రసిద్ధి నొందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు చంద్రమౌళి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయంలో స్వామివారికి పూలు, పడగలు సమర్పించేందుకు భక్తులు బారులు తీరారు. జనుపల్లిలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి పంచ కావిళ్లతో గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు, భవానీలు, భక్తజనం తరలివెళ్లారు. ఎ.వేమవరంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచ కావిళ్లతో అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కోంపెల్ల వెంకటశ్రీనివాస్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. నడిపూడి మెట్ల రాంజీ కాలనీలో పుట్ట ఆలయం వద్ద స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. చంద్రమౌళి వెంకటేశ్వరశర్మ, ఆకొండి శ్రీకృష్ణ ఆచార్య బ్రహ్మత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద షష్ఠి తీర్థం వైభవంగా జరిగింది.


ఎ.వేమవరంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం వద్ద క్యూలో భక్తులు

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

రూ.31.68 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారి తీరువీధుల్లో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.31.68 లక్షలు లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో క్యూలైన్లో భక్తులు



అన్నమయ్య కీర్తనలకు వన్నెలద్ది..

నేడు వర్ధంతి

కర్నాటక సంగీతాన్ని సుసంపన్నం చేసిన సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి

(ఆంధ్రజ్యోతి- పిఠాపురం)

ఆయన సంగీత కచేరీలు మరుపురానివి.. ఆయన స్వరపరిచి ఆలపించిన కీర్తనలు వినసొంపైనవి.. సంగీత, కళాభిమానుల చెవుల్లో అవి ఇంకా వినబడుతూనే ఉన్నాయి. ఎందరో ఉద్దండుల మన్ననలు పొందిన ఆయనే ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి. ఆదివారం నేదునూరి వర్ధంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేస్తున్న శ్రీరామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంపతులకు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న జన్మించారు. తన తల్లి, మేనమామల ద్వారా సంగీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయొలిన్, సంగీతాన్ని నేర్చుకున్నారు. 1950 వరకూ పిఠాపురంలోనే నివసించిన ఆయన తర్వాత ఇక్కడ నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.

అన్నమాచార్య కీర్తనల్లతో ప్రాచుర్యం

దేశ, విదేశాల్లో నేదునూరి కృష్ణమూర్తి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. నానాటి బ్రతుకు నాటకం కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రముఖ గాయకురాలు ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి ప్రశంసిస్తూ ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వొచ్చు అన్నారంటే ఆయన ప్రతిభ ఇట్టే అర్థమవుతుంది. వీటితో ఆయన స్వరపర్చిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధరసాలతో భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నాట్యకళాశాల ప్రధాన అధ్యాపకుడిగా తదనంతరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు.

అవార్డులు, పురస్కారాలు

నేదునూరికి పలు పురస్కారాలు, అవార్డులు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ సంగీత చూడామణి అవార్డుతో తొలుత సత్కరించింది. అప్పటినుంచి 2014 వరకూ 53కిపైగా పురస్కారాలు అందుకున్నారు. వీటిలో 1991లో మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళానీరాజన పురస్కారాలు ప్రధానమైనవి. స్వరవిలాస్, నాద సుధానిధి, సంగీత విద్వన్మణి, నాదయోగి, సంగీత కళాభారతి తదితర 51కిపైగా అవార్డులు ఆయన్ను వరించాయి.

పిఠాపురంపై ఎనలేని మమకారం

నేదునూరి ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. చిన్నతనంలో ఆయన కుటుంబం పిఠాపురంలోని కోటవారివీధి, ఆకొండివారి వీధిలో నివాసం ఉంది. ఆ వీధుల్లో నివసిస్తున్న వృద్ధుల్లో పలువురికి నేదునూరి కుటుంబంతో అవినావభావ సంబంధాలున్నాయి. జీవితచరమాంకంలోనూ అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర రోజుల ముందే పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళంగానూ అందించారు. అనారోగ్యానికి గురయ్యే వరకూ నేదునూరి కీర్తనలను ఆలపిస్తూ.. స్వరపరుస్తూనే ఉన్నారు. నాదాసుధ తరంగిణి సంస్థ ద్వారా నాదయోగి ఆత్మకథ, 108 భద్రాచలం రామదాసు కీర్తనలు, భక్తిరస కీర్తనలు, 200కిపైగా అన్నమయ్య సంకీర్తనలు, 25 యోగా నారాయణ కీర్తనలను ఆయన స్వరపరిచారు. 87 ఏళ్ల వయస్సులో 2014, డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు.

ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే తాజాగా క్రిస్మస్ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సామర్లకోట మీదుగా విశాఖ-సికింద్రాబాద్, బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే పీఆర్వో కార్యాలయంనుంచి రాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు అందాయి.ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు డిసెంబరు 8 రాత్రి నుంచి డిసెంబరు 30 వరకూ విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించనున్నాయి.

●07097 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 4.35గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు విశాఖ వెళ్తుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుంది.

●079098 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రై లు విశాఖ నుంచి రాత్రి 7 గంటలకు బ యలుదేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ రైలు డిసెంబరు 9, 16, 23, 30 తేదీల్లో విశాఖ నుంచి బయలుదేరుతుంది

బ్రహ్మపూర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లు

● 07028 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బ్రహ్మపూర్‌నుంచి సాయంత్రం 4.45 గంట లకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.35గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబరు 14, 21, 28 తేదీల్లో బ్రహ్మపూర్ నుంచి బయలుదేరుతుంది.

● 07027 నెంబరు ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.45గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్‌నుంచి బయల్దేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, ఇచ్ఛాపురం స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు.

షష్టి ఉత్సవాల్లో ఉద్రిక్తత

» ఇరువర్గీయులకు గాయాలు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. తీర్థంలో రెండు సామాజిక వర్గాల యువకులు మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. ఇది కాస్తా ఉద్రిక్తతకు దారితీయడంతో రెండువర్గాలకు చెందిన వారు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో గాయపడిన ఇరువర్గాలకు చెందిన వారిని 108 అంబులెన్స్ ద్వారా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఆధ్వర్యంలో సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పెద్దలతో శాంతి చర్చలు నిర్వహించారు. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం.. (ఇన్‌సెట్)లో శ్రీపాదశ్రీవల్లభుడు

ఇక్కడ కొబ్బరి కాయలు కొట్టరు.. కడతారు

ఆ ఆలయానికి వెళ్తే మనం ఆంధ్రాలో ఉన్నామా.. లేక.. వేరే రాష్ట్రంలో ఉన్నామా అనే భావన కలుగుతుంది. ఎందుకంటే అక్కడ మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, వెస్ట్‌బెంగాల్ వంటి రాష్ట్రాలనుంచి భక్తులే ఎక్కువగా కనిపిస్తారు. అదే పిఠాపురంలో దత్తాత్రేయుడి మొదటి అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం.. తూర్పు, ఉత్తరాది భక్తులకు ఇది ప్రత్యేకమైన ఆలయం.. ముఖ్యంగా మహారాష్ట్ర భక్తులు మరీ ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ కొబ్బరికాయ కొట్టకుండా కట్టడం ప్రత్యేకత. ఇక్కడి ఔదంబర వృక్షానికి భక్తులు కొబ్బరికాయ కట్టి తమ కోర్కెను చెప్తే నెరవేరుతుందని వారి నమ్మకం. ఈనెల 8నుంచి 14 వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ఈ ఆలయం విశేషాలపై ప్రత్యేక కథనం..

» ఇక్కడ ఇదొక ప్రత్యేకత
» పిఠాపురంలో దత్తాత్రేయుడి ప్రథమ అవతారం శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం
» ఏడాదికి ఒక్కసారైనా వచ్చే మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు
» మరాఠీలకు ఇలవేల్పు శ్రీపాదుడు
» నేటినుంచి 14 వరకు సప్తాహాలు

పిఠాపురం, డిసెంబరు 7: శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఉంది. ఇక్కడకు మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాలు, కర్నాటక నుంచి వచ్చే భక్తులు వస్తున్నారు. మరాఠీలు శ్రీపాదులు వారిని ఇలవేల్పుగా భావిస్తారు. దీంతో మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఏటా ఒక్కసారైనా ఈ క్షేత్రానికి తరలివస్తారు. ఒకప్పుడు ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల్లో వీరే 90శాతానికి పైగా ఉండేవారు. ఇప్పుడు పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ పోటీ చేయడం.. ఆయన డిప్యూటీ సీఎం కావడంతో ఇతర రాష్ట్రాలను ప్రాచుర్యం పొంది భక్తులు తరలివస్తున్నారు. ఏటా 20లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా. ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతోపాటు శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ జరిగే పూజలు, గోపూజ, దత్త హోమం, మండలాభిషేకపూజ, శనిప్రదోష పూజ, నవగ్రహహోమం, లక్ష్మీగణపతిహోమం, చండీ పారాయణ, చండీహోమం, మహా మృత్యుంజయహోమం, అనఘా దత్తవ్రతం, పల్లకీసేవల్లో భక్తులు పాలుపంచుకుంటారు.

కొబ్బరికాయ కడితే కోర్కె నెరవేరినట్లే..

అన్నిక్షేత్రాల్లో మాదిరిగా శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కడతారు. కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి ఔదంబర వృక్షం చుట్టూ ప్రదిక్షణాలు చేసి శ్రీపాదుడిని తమ కోర్కెలు నెరవేర్చమని కోరుకుంటారు. కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ వారు శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలుచేస్తారు. ఇక్కడ అభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించిన భక్తులకు ప్రసాదంగా కొబ్బరికాయలనే ఇస్తారు. వీటిని భక్తులు ఇక్కడ కొట్టకుండా ఇంటికి పట్టుకెళ్లి శ్రీపాదశ్రీవల్లభుని స్మరించుకుని కొట్టి దాన్ని ప్రసాదంగా స్వీకరించాలని అర్చకులు పూజల సందర్భంగా చెబుతారు.



పూజల్లో పాల్గొన్న మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల భక్తులు

నమ్మకమే నడిపిస్తుంది

భక్తులకు శ్రీపాదశ్రీవల్లభుడిపై ఉన్న నమ్మకమే ఇటువైపు నడిపిస్తుందని మహారాష్ట్ర, కర్నాటక, గోవా, ఉత్తరాది తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు చెబుతున్నారు.ఈ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్న వారైనా తమ హోదాను మాత్రం ఇక్కడ చెప్పరు. సామాన్యుల్లానే శ్రీపాదుని దర్శించుకుని పూజల్లో పాల్గొంటారు. కీలకహోదాల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు ఇదే పద్ధతిని పాటిస్తారు. కొందరు ఇక్కడ ఆలయ వసతిగృహాల్లోనే బస చేసి అన్న ప్రసాదాలను స్వీకరిస్తారు.

వారి విరాళాలే

ఆలయానికి వచ్చే విరాళాలు అధికశాతం మహారాష్ట్ర, ఉత్తరాది భక్తుల నుంచే వస్తున్నాయి. మహారాష్ట్ర భక్తులు తమ సంపాదనలో కొంతభాగాన్ని పక్కకు తీసి ఇక్కడకు వచ్చినప్పుడు విరాళంగా అందజేస్తారు. ఇక్కడ నిర్మించిన భవనాలు, ఇతర సౌకర్యాల కల్పనకు అందిన విరాళాల్లో వీరిదే సింహభాగం. భక్తులకు ఆలయప్రాంగణంలోనే ఉచిత వసతి ఉంది.



శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కడుతున్న భక్తులు

కోర్కెలు నెరవేరతాయని నమ్మకం

-నాగాభట్ల రాంబాబు, అర్చకులు



శ్రీపాదశ్రీవల్లభునికి నారీకేళ అర్పణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని, మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఔదంబర వృక్షానికి నారీకేళం కడతారు. అనుకున్న కోర్కెలు నెరవేరిన తర్వాత ఇక్కడకు మళ్లీ వచ్చి స్వామికి జరిగే పూజల్లో, అన్నదానాల్లో పాలుపంచుకుంటారు. శతాబ్దాలుగా నారీకేళాన్ని కట్టే పద్ధతి ఇక్కడ ఆచారంగా ఉంది.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ సంస్థానం

మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరాది, ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తున్నారు. వీరందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొబ్బరికాయలను ఔదంబర వృక్షానికి కట్టడం ఇక్కడ ఆచారంగా వస్తోంది. ఇందుకు అనుగుణంగా భక్తులకు కొబ్బరికాయలను అందుబాటులో ఉంచుతున్నాం. దేవస్థానం కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నాం.



నేటి నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో ఆదివారంనుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధప్రాంతాలనుంచి భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అధికంగా తరలివస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు విస్తృతఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఆదివారం నుంచి 14వ తేదీ దత్తజయంతి వరకూ ప్రతిరోజూ మహాగణపతిపూజ, కలశ స్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హారతులు, స్వామికి పల్లకీసేవ జరుగుతాయి.

రోజువారీ కార్యక్రమాలు..

ఆదివారం ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్ష తులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతి రోజు సాయంత్రం దత్తాత్రేయస్వామి రథోత్సవం నిర్వహిస్తారు. దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

» జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్



అమలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫాయి కర్మచారుల అభ్యున్నతికోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జాతీయ కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ అన్నారు. ఆయా పథకాల ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి జీవనోపాధుల కల్పనకు కృషి చేయాల్సి బాధ్యత అధికారులకు ఉందన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, బ్యాకింగ్, విద్య, కార్మిక, పోలీసు అధికారులతోపాటు సఫాయి కర్మచారి కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిట్టచివరి లబ్ధిదారుడికి సైతం సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సఫాయి కర్మచారి కార్మికుల పరిస్థితులను జాతీయస్థాయిలో కమిషనర్ పరిశోధించి కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనున్నట్లు వెల్లడించారు. అసమానతలు లేకుండా సఫాయి కార్మికులు అన్నివిధాలా ఎదిగేలా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పనిముట్లు అందించాలన్నారు. కర్మచారీ కార్మికులకు పీఎంఏవై, టిడ్కో పథకాల ద్వారా గృహాలు మంజూరు చేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకు వాహనాలు సమకూర్చిన వారికి లిక్విడ్ వేస్ట్ అన్‌లోడింగ్‌కోసం ట్రీట్మెంట్ ప్లాంట్లను రాబోయే రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుద్య పనులు చేసేవారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వారికి కనీస వేతనాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

పారదర్శకంగా నిర్వహించాలి

» కాకినాడ జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి ఏఆర్వో, కాకినాడ జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డీటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు వంటి ఇతర అంశాలపై కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుల్స్‌పై 9రౌండ్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపులో ఎలాంటి గందరగోళ పరిస్థితులు నెలకొనకుండా లెక్కింపు ప్రక్రియ అంతా పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డిటెయిల్డ్ కౌంటింగ్ జరుగుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డిటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు విధులు వంటి ఇతర అంశాలపై కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చేదులూరి పద్మరాజు

గొల్లప్రోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో శనివారం జరిగిన గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన చేదులూరి పద్మరాజు అలియాస్ చంటబ్బాయి(58) కూలీ పని నిమిత్తం సైకిల్‌పై వెళ్తుండగా బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి పిఠాపురం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో ముగిసిన ప్లాస్టిక్ సర్జరీ సదస్సు

» తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది వైద్యులు
» కొత్త పరిశోధనలు, సర్జరీలకు శ్రీకారం





వైద్యసదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు.. సదస్సు ముగింపులో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ అస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా (ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్)-2024 ఆధ్వర్యంలో కాకినాడలో మూడురోజులుగా జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథులుగా డీఎంఈ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య సదస్సులు, సెమినార్లలో పాల్గొనడం ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సుల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడం, మనం నేర్చుకున్న విషయాలను గ్రూపులో ఒకరికొకరు చర్చించుకోవడంతో కొత్త ఆవిష్కరణలకు వీలుంటుందన్నారు. ఈనెల 5న కెడావర్ శస్త్ర చికిత్స, ఫిల్లర్స్, బొటాక్స్, థ్రెడ్ లిఫ్ట్ తదితర వాటిపై ప్రదర్శన, డిమానిస్ట్రేషన్, 6, 7 తేదీల్లో ప్లాస్టిక్ సర్జరీల్లో వస్తున్న కొత్త పోకడలు, నూతన ఆవిష్కరణలపై సైంటిఫిక్ సెషన్లు నిర్వహించామని ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్టరీ, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.రత్నభూషన్ తెలిపారు. ఈ సదస్సులో దేశంలో ఉన్న నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు హాజరై లైవ్‌గా మృతదేహాలపై శస్త్రచికిత్సలు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ ప్యాట్రిన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ప్రవీణ, కార్యదర్శి డాక్టర్ ఎన్.రాంబాబు, ఏపీ, తెలంగాణాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు, 300మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ సెజ్ ద్వారా యనమలకు

ఆయాచిత లబ్ధి: వైసీపీ

సర్పవరం జంక్షన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజడ్‌కు మొదటిగా భూమి ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసిచ్చింది అప్పటి స్థానిక ఎమ్మెల్యే యనమల రామకృష్ణుడని, సెజ్ ద్వారా యనమల ఆయాచిత లబ్ధి పొంది రైతులను మోసం చేశారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. శనివారం వైద్యనగర్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వంగా గీతతోపాటు కొత్తపల్లి మండలం తొండంగి మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. సెజ్ కోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి వెనక్కి ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఏరువాక పేరుతో రైతుల భూములు వెనక్కి ఇచ్చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, తర్వాత మాటతప్పి రైతులపై అక్రమ కేసులు, నిర్బంధాలతో వేధింపులకు గురి చేసి భూములను వెనక్కి లాక్కున్నారని విమర్శించారు. రైతులు దాడిశెట్టి నారాయణస్వామి, ప్రసాదరెడ్డి, సుబ్బిరెడ్డి, చింతా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన డబ్బులు తీసుకోకుండా కోర్టులో కేసులు వేశామన్నారు. ఈ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీ రావు, జీఎంఆర్‌లు భూములు తీసుకుని బ్యాంకులో తనకాపెట్టి రుణాలు తీసుకుని, ఆ డబ్బుతో భూములు కొనుగోలు చేసి వ్యాపారం చేశారని ఆరోపించారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది ఎంపిక



ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కాలికట్‌లో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకూ జరిగే ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు 18 మంది ఎంపికయ్యారని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. కళాశాల క్రీడామైదానంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో మంచి ప్రతిభ చూపిన 18 మంది క్రీడాకారులను కాలికట్‌లో జరిగే ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక చేశారు. అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కాకినాడ ఐడియల్ కాలేజ్ ప్రథమ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ద్వితీయ, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తృతీయ, కొయ్యలగూడెం ప్రకాష్ కళాశాల నాలుగో స్థానంలోని నిలిచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

వాడపాలెంలో ఓ ఇంట్లో చోరీ

» రూ.5లక్షల నగదు, ఐదు కాసుల బంగారం అపహరణ



కొత్తపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వాడపాలెంలో ఇంట్లో ఎవ్వరి లేని సమయంలో చోరీకి పాల్పడి నగదు, బంగారు వస్తువులు గుర్తుతెలియని ఆగంతకులు దోచుకుపోయిన్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి వాడపాలెం గ్రామాని కి చెందిన శ్రీకాకోళపు సుమన్ తన తల్లితో కలిసి రాజోలు మండలం పొదలాడలో బంధువుల ఇంటికి శుభకార్యక్రమానికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. బీరువా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి చూసేసరికి బీరువాలో ఉంచిన రూ.5లక్షల నగదు, 5కాసుల బంగారం మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సురేంద్ర సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అమలాపురం నుంచి క్లూస్‌టీమ్, పోలీసుల జాగిలాలను రప్పించారు. దీనిపై సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

భూకంపం జోన్‌లో

పోలవరం

» మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు భూకంపం జోన్‌లో ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనే భూకంపం నమోదైందన్నారు. భూకంపాలు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ వస్తాయో ఊహించలేమన్నారు. గోదావరి పరీవాహకప్రాంతం భూకంపం జోన్ -3లో ఉందని చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం డైట్ బండ్ నిర్మాణాన్ని మేఘా కంపెనీకి అప్పగించారని ఆ కంపెనీ నాణ్యత పాటించకపోవడంతో డైట్ బండ్ కొట్టుకుపోయిందన్నారు. మళ్లీ అదే కంపెనీకి అప్పగించడం అభ్యంతరకరమన్నారు. భూకంపాలను తట్టుకుని నిలబడాలంటే డబుల్ డయాఫ్రంవాల్ తప్పకనిర్మించాలన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రూ.5 కోట్ల ఆస్తిని అన్యాక్రాంతం చేసిన మాజీ ఎంపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర నడిబొడ్డున ఉన్న గౌతమి కోఆపరేటివ్ సూపర్‌బజార్‌కు చెందిన రూ.5 కోట్లు విలువ చేసే ఆస్తిని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అక్రమంగా అన్యాక్రాంతం చేశారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాయలంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా అధికార మదంతో మాజీ ఎంపీ భరత్‌రామ్ చేసిన అక్రమాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయన్నారు. రాజమహేంద్రవరం పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న గౌతమి సూపర్‌బజార్ భూమిని అక్రమంగా భరత్ రామ్ అన్యాక్రాంతం చేశాడన్నారు. 11ఏళ్ళకు లీజు అగ్రిమెంట్‌ను ముడుపులు తీసుకుని 33 ఏళ్ళకు సబ్ లీజుకు మార్చేశారన్నారు. లీజు విషయంలో మాట వినడం లేదని గౌతమి సూపర్‌బజార్ కార్యవర్గాన్ని సైతం అప్పట్లో రద్దుచేసి ఈ అక్రమానికి తెగబడ్డారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారని చెప్పారు. నగరంలో జరిగిన పనులు, పార్కుల్లో అవినీతిపై విచారణ జరుగుతుందని..25 శాతం కమిషన్లు బయటకు తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, నక్కా దేవివరప్రసాద్, కిలపర్తి శ్రీను, బూరా రామచంద్రరావు, కరగాని వేణు పాల్గొన్నారు.

భాషను ఆస్వాదించాలంటే
సాహిత్యాన్ని ఉపయోగించాలి

నన్నయ వర్శిటీ డీన్ రమేష్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు భాషపై గొప్ప అనుభవాన్ని అందించాలంటే సాహిత్యాన్ని ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నన్నయ యూనివర్శిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్, డీన్ కేఎస్ రమేష్ అన్నారు. రాజమహేంద్రరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం 'ముద్రితం నుంచి మౌఖికం వరకూ భాష, సాహిత్యం యొక్క సమ్మేళనం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వివిధ యూనివర్శిటీలకు చెందిన ప్రొఫెసర్ టి.విశ్వనాథరావు, ప్రొఫెసర్ కాంతిమతి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆష్మాధషైల్ తదితరులు పాల్గొని భావ వ్యక్తీకరణ కోసం వాడుతున్న భాష గురించి, సాహిత్యం గురించి వివరించారు. కళాశాల ఇంగ్లీష్ విభాగం ఇన్‌చార్జి ఎం.శ్రీలక్ష్మి సదస్సు లక్ష్యాలను వివరించారు. సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ.రాజేశ్వరి, ప్రొఫెసర్ నాగభూషణం, నూజిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఏపీ సాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

కొవ్వూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతిఒక్కరూ తోడ్పాటును అందించాలని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో శనివారం కరస్పాండెంటు నెల్సన్ ఆంటోని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు రవాణ చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అటువంటి వారి వివరాలు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకగా మెగా పేరెంట్స్ డే
- పలుచోట్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆటలపోటీలు


అనపర్తి జడ్పీ హైస్కూల్లో సమావేశంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల నడవడిక పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాఠశాల, నాగరాజు,నన్నయ్య, కంటిపూడి, సుంకర, ఆనంద్‌నగర్, ప్రకాష్‌నగర్‌లో శనివారం జరిగిన ప్రభుత్వ పాఠశాలల మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహిస్తోందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పేరెంట్స్ సమావేశాల్లో ఫొటో ఎగ్జిబిషన్లు, న్యూట్రిషన్ ఫుడ్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నన్నయ మునిసిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజన పథకాన్ని కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పుడప్పుడు తల్లి దండ్రులు తనిఖీ చేయాలన్నారు.ఆత్మీయ సమావేశాల్లో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు, స్కూల్ హెచ్ఎంలు శాంతకుమారి, ఆర్.సన్యాసిరావు, ఏఎల్.నరసింహరావు, దాసరి శివసత్యమూర్తి, బీవీ.ఆనంద్ ,సత్యనారాయణ, త్రీటౌన్ సీఐ అప్పారావు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మరుకుర్తి రవియాదవ్, బొమ్ములదత్తు, రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.


ఎంఆర్ పాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్ చంటి

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ వీవీ సత్యప్రసాద్ విచ్చేసి మాట్లాడారు. ఉన్నత పదవులను అలంకరించిన వారు, అభివృద్ధి చెందిన వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని అన్నారు. ఈ సందర్భంగా పురుషులకు తాడు లాగడం, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ ఎం.సత్యవతి, ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, సీఐ ఎ.వెంకటేశ్వరరావు ఎంపీడీవో కె.రమేష్, గొల్లపల్లి సత్యనారాయణ, రామదాసు పేపరుబోర్డు చైర్మన్ శివశంకరరెడ్డి, పాటంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు. మాధవరాయుడుపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో సర్పంచ్ అన్నందేవుల చంటి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈవీవీ ప్రసాదరావు, ఎంపీటీసీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని పాఠశాలల్లోను సమావేశాలు నిర్వహించారు. ముందుగా తల్లిదండ్రులను విద్యార్థులతో ఆహ్వానింపజేశారు. తల్లిదండ్రులకు హోలిస్టిక్ కార్డులపై చర్చ, తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు తాడు ఆట, సమావేశంలో తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరణ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో గ్రూపు ఫొటో అనంతం పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలసి సహపంక్తి భోజనాలు చేశారు. పందలపాక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, మండల ప్రత్యేకాధికారి విజయకుమారి, ఎంఈవో సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. కొంకుదురు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.


బిక్కవోలులో తండ్రుల టగ్ ఆఫ్ వార్

అనపర్తి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తల్లిదండ్రులతో పలు అంశాలపై చర్చించి విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ గల్లా రాము ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకే మంత్రి నారా లోకేశ్ మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కొత్తపల్లిలోని రాజుగారితోటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందు, కామరాజుపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్.ఈశ్వరిదేవి, ఎస్ఎంసీ చైర్మన్ రాధాకృష్ణ, కృష్ణునిపాలెం ఎంపీపీ యూపీ స్కూల్లో చైర్మన్ అమరా దొర పాల్గొన్నారు.


భూపతిపాలెం కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతుల నవీన్

కోరుకొండ: మండలంలోని గాడాల, నిడిగట్ల, దోసకాయలపల్లి, కాపవరం, పశ్చిమగోనగూడెం, శ్రీరంగపట్నం, రాఘవాపురం తదితర పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించారు. డ్రగ్స్ నిర్మూలన, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు, ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. సమావేశాల్లో ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎమ్మార్వో సుస్వాగతం, ఎస్ఐ శ్యామ్‌సుందర్, మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఎంఈవోలు కుశలవదొర, సుజాత, విద్యా కమిటీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో జ్ఞాపిక ఇస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజానగరం: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 80శాతం మేర విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు ఏర్పడి, పాఠశాలల విద్యాభివృద్ధికి, క్రీడలు, కళల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో గౌరీశంకర్, ఎంపీడీవో జేప ఝాన్సీ తహశీల్దార్ లక్ష్మీలావణ్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ గెద్దాడ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తహశీల్దార్ కుమార్, బొమ్మూరు ఎస్ఐ అంకారావు, ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి, రాములు పాల్గొన్నారు. బొమ్మూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, విచ్చేశారు. హుకుంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో డాక్టర్ గోరంట్ల రవికిరణ్ పాల్గొని విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దేవరపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో విద్యుదాఘాతంతో శనివారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ప్రకారం.. మండలంలోని లక్ష్మీ పురం గ్రామానికి చెందిన పాకా రామకృష్ణ(40) దేవరపల్లిలోని కల్లూరి ఎంటర్‌ప్రైజస్ తూర్ల తయారీ కంపెనీలో పని చేయడానికి వచ్చాడు. ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కు తగిలించే క్రమంలో ట్రక్కు ఒక్కసారిగా పైకి లేవడంతో విద్యుత్ తీగలు తగలడంతో రామకృష్ణ షాక్‌కు గురై కుప్ప కూలిపోయాడు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది నట్టు వైద్యులు తెలిపారు.



మృతుడి కుమారుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని పేర్కొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

తాళ్లపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం సమీపంలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.8,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రం ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కడప జిల్లా వేంపల్లి, జంగారెడ్డిగూడెం, కాకినాడ, తిరుపతి ప్రాంతాలకు చెందిన నాట్య కళాసంస్థల కళాకారులు పాల్గొన్నారు. కళాక్షేత్రం నిర్వాహకురాలు సాయిమాధవి పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో పోతని శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్బారాయుడి కల్యాణం


శ్రీకృష్ణపట్నంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

దివాన్‌చెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, సంపత్‌నగరం, పాతతుంగపాడు, లాలా చెరువు హౌసింగ్ బోర్డుకాలనీల్లో శనివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. శ్రీకృష్ణపట్నం గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిపారు. ఈ ఉత్సవాలు ఐదురోజులపాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది. బాణసంచా కాల్పులతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాతతుంగపాడు, సంపత్‌నగరం, హౌసింగ్ బోర్డు కాలనీల్లో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని జరిపారు. శనివారం స్వామివారికి ప్రభాత సేవ అభిషేకాలు జరిగాయి. దివాన్‌చెరువులోని శ్రీవిశ్వేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న బాలకుమారస్వామికి ఆరురోజులుగా జరుగుతున్న షష్ఠి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. స్వామివారికి అభిషేకాలు, బిల్వదళాలతో సహస్రనామార్చనను ఆలయ నిర్వాహకులు డాక్టరు రాంబాబు, సుబ్బలక్ష్మి దంపతులు చేశారు.

కడియం: బుర్రిలంకలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. వేమగిరి తోటలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం నుంచే భక్తులు బారులుతీరారు. వీరవరం చేనేత కాలనీలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు జరిపారు. ఉదయం నుంచి శివాలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వైభవంగా వీరాజు మామిడి షష్ఠి వేడుకలు

అనపర్తి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా శనివారం అనపర్తిలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు జరిపారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను చేశారు. స్వామివారిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆదియూత్ అధ్యక్షుడు మల్లిడి ఆదినారాయణరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. కెనాల్ రోడ్డు నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పడవలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు వి.సత్తిరెడ్డి, ఎం.పోతారెడ్డి తదితరులు వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోరుకొండ: కోరుకొండలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మైదానం భక్తులతో నిండిపోయింది. వేల సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి అర్థరాత్రి వరకు స్వామివారిని దర్శించుకున్నారు. నర్సాపురం, గాదరాడ, గుమ్ములూరు, గాడాల తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యస్వామి వార్షిక షష్ఠి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆరురోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆయా ఆలయాల కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు.

వైభవంగా స్వామి వారి కల్యాణం: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, విశ్వనాథల శర్మల ఆధ్వర్యంలో మోపర్తి వెంకటకృష్ణ దంపతులతో స్వామి కల్యాణాన్ని జరిపారు. నర్సాపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు మర్ల ప్రభాకరశర్మ, మర్ల రాజాశర్మల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. కల్యాణం అనంతరం వీరభద్రుడి సంబరం, కళావేదికపై రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, విశాఖ వారిచే సినీసంగీత విభావరి జరిగింది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉల్లి వీరవెంకట సత్యప్రసాద్, బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు మొదటి రోజు స్వామివారిని దర్శించుకున్నారు.


కడియంలో స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్వామి సన్నిధిలో శయనించిన మహిళలు

రాజానగరం: రాజానగరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 98వ షష్ఠి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జనసేన నాయకురాలు గంటా స్వరూపాదేవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఆలయంలో మహిళా భక్తులు లలితా, విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు.

సంతానం కోసం: మహిళలు నాగుల చీర ధరించి ఉపవాసంతో స్వామి సన్నిధిలో శయనిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. దూర ప్రాంతాల వచ్చిన పలువురు మహిళలు నాగుల చీరలు ధరించి శయనదీక్ష చేపట్టారు.

కల్యాణం...కమనీయం : షష్ఠి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన శనివారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఆలయ ప్రతిష్ఠాపకులు, రాజమహేంద్రవరానికి చెందిన సంకా జయరామ్ గుప్త వంశీకులచే ఆలయ అర్చకులు కొడమంచిలి సుబ్రహ్మణ్యం నిర్వహించారు. బాణసంచా కాల్పులు, విద్యుద్దీపాలంకరణలతో స్వామి వారి ఆలయం శోభాయమానంగా కానవచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.


అనపర్తిలో వీర్రాజు మామిడి వద్ద స్వామివారిని దర్శించుకునేందుకు పడవలపై రేవు దాటుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి


రాజానగరంలో స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు


రాజానగరంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

బెల్ట్‌షాపు నడుపుతున్న వ్యక్తి అరెస్టు

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న మల్లెల వెంకటేశ్వరరావు షాపుపై శనివారం రంగంపేట ఎక్సైజ్ సీఐ సుమ ఆధ్వర్యంలో పోలీసులు దాడి జరిపారు. ఈ సందర్భంగా షాపులో వున్న 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసామని సీఐ తెలిపారు.

నూతన సాంకేతికతపై నైపుణ్యాలు పెంచుకోవాలి

దివాన్‌చెరువు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు చదువుతోపాటు నూతన సాంకేతికతపై నైపుణ్యాలు పెంచుకోవాలని యుఎస్ఎలో సీనియర్ ఫార్మకాలజిస్ట్ డాక్టర్ దాట్ల శ్రీనివాసరాజు అన్నారు. దివాన్‌చెరువులోని విజె ఫార్మశీ కళాశాలలో శనివారం డ్రగ్ డిస్కవరీ అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన డ్రగ్ డిస్కవరీ గురించి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తక్కువ సమయంలో డ్రగ్ డిస్కవరీ చేయగలుగుతున్నారన్నారు. సదస్సులో విజె ఫార్మశీ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ఎన్వీవీ జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ ఔషధ రంగం ఎంతో ప్రాముఖ్యమైన రంగం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, డైరెక్టర్ ఎన్.నిరూప్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


వధువుకు పెళ్ళి కానుక చెక్కును అందజేస్తున్న జ్యోతుల నవీన్

ఆడపడుచుల కళ్లలో ఆనందం చూసేందుకే పెళ్లికానుక

గోకవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గంలో ఆడపడుచుల కళ్ళల్లో ఆనందం చూసేందుకే పెళ్లికానుక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ కాకినాడ జిల్లా అధ్య క్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలం లోని మల్లవరం గ్రామంలో శనివారం జరిగి పెళ్లి వేడుకల్లో నవీన్ పాల్గొని రూ. 20,000 చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అర్హులైన నవవధువులకు ఆర్థికసాయం అందజేస్తా మని, పెళ్ళికి పది రోజుల ముందు టీడీపీ నాయకుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గోకవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామ శివారున పజుల్లాబాద్ వెళ్ళే మార్గంలో శనివారం అన్నసమారాధన జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వస్వామి షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకొని తంటికొండకు చెందిన ఆకుల త్రినాధ్ మార్కేండేయ సత్యనారాయణ, ఆకుల నాగ వెంకట శివరామకృష్ణ అన్నదానాన్ని జరిపారు. ఐదు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు సత్యనారాయణ, శివరామకృష్ణ మాట్లాడుతూ పూర్వం నుంచి ఇది ఆనవాయితీగా వస్తుందని, దీన్ని తామే కొనసాగిస్తున్నామన్నారు. అన్నదాన కార్యక్రమానికి తమ బంధుమిత్రులందరూ సహకారాన్ని అందించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.


గోకవరం గ్రామ శివారున నిర్వహించిన అన్న సమారాధన

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 8 డిసెంబరు 2024 | 5







తుఫాన్ వస్తే.. మాకేం భయం!

ఒక వైపు తుఫాన్ అంటుంటే
ఇదెలా సాధ్యం అంటారా..
అదే మరి రైతు అంటే..
దేవుడి మీద భారం వేస్తాడు..
సాగులో దిగిపోతాడు.. భూదేవి
తల్లి తమకు అన్యాయం
చేయదని నమ్మకం..
ఆ నమ్మకమే రైతులను
ముందుకు నడిపిస్తుంది..
అందరి కడుపునింపుతుంది..
ఒక పక్క తుఫాన్ అంటూ జిల్లా
రైతాంగం భయపడుతుంటే..
కొవ్వూరు మండలం
ధర్మవరంలో మాత్రం
రైతాంగం నారుమడులకు
ఇలా సన్నద్ధమైపోయారు..
ముందస్తు సాగులో దిగారు.
- కొవ్వూరు

దీవించు..సుబ్రహ్మణ్యేశ్వరా!



దేవరపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి బారులుతీరిన భక్తజనం.. బిక్కవోలులో స్వామి ఊరేగింపు

జిల్లా వ్యాప్తంగా షష్ఠి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు.. బిక్కవోలు, రాజానగరం, దేవరపల్లి, ఉండ్రాజవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం, కోరుకొండ తదితర మండలాల్లో ఆలయాల వద్ద జనం బారులు తీరారు.. దీవించరా.. సుబ్రహ్మణ్యేశ్వరా అంటూ మొక్కుకున్నారు.. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. బిక్కవోలు వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనంపోటెత్తారు.. - వివరాలు 8లో

ఇన్‌స్టాలో పరిచయం.. మోసపోయిన బాలిక

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ప్రేమగా మారింది.. ఎవరో తెలియకుండానే దగ్గరైంది..చివరికి మోసపోయానని తెలుసు కుని ఒక బాలిక పోలీస్‌స్టేషన్ బాట పట్టింది. కొవ్వూరు మండలానికి చెందిన బాలిక(16) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది.ఏడు నెలల కిందట పోలవరానికి చెందిన వీరేంద్రతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో తరచుగా చాటింగ్ చేసుకునేవారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక ఇంటికి వచ్చి 4 సార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఈ నెల 5వ తేదీన బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించి ఆరు నెలల గర్భిణీ అని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక కడుపులో పిండం ఎదుగుదల సరిగా లేకపోవడంతో వైద్యులు గర్భాన్ని తొలగించి బాధితురాలికి చికిత్స అందించారు. బాలిక ఫిర్యాదు మేరకు వీరేంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నేటి నుంచి మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు (ఔట్ సోర్సింగ్) కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళుతున్నారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుబాబు, సర్వేశ్వరరావు యూనియన్ నాయకులు ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసును కలిసి వినతిపత్రం అందించారు. సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ వర్కర్లకు రూ.29,200, నాన్‌టెక్నికల్ వర్కర్లకు రూ.24500 జీతం ఇవ్వాలనే ఆరు డిమాండ్లలో సమ్మె చేస్తున్నామని వారు ప్రకటించారు.

లాయర్లతో పోలీస్ మీట్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం న్యాయవాదులతో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లకు కోర్టుల్లో రిమాండ్ అంశాలపై తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు అవగాహన కల్పించారు.అరెస్టులు, రిమాండ్‌లు తదితర అంశాలపై కోర్టు కానిస్టేబుళ్లకు స్పష్టత ఇచ్చారు.కానిస్టేబుళ్ల వారి సందేశాలను నివృత్తి చేసుకున్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి న్యాయమూర్తి ప్రకాష్‌బాబు, రిటైర్డ్ పీపీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఫ్లాగ్ డే నిధికి ప్రతి ఒక్కరు తమ వంతుగా విరాళాలు సేకరించి జమచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ డే విరాళల సేకరణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ ప్రారంభించారు.క్యూఆర్ కోడ్ విడుదల చేశారు. దేశ రక్షణలో సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ప్రతి ఏటా డిసెంబరు 7 నుంచి దేశ వ్యాప్తంగా ఫ్లాగ్ డే నిర్వహించుకుంటున్నామన్నారు. దేశం కోసం ,ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు,విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు ఎదురొడ్డి సేవలందించే సాయుధ దళాలకు మనవంతం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విరాళాలను జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరున ఎస్‌బీఐ జిల్లా పరిషత్ శాఖ కాకినాడ బ్రాంచ్, ఖాతా నెంబరు 62064060626, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐ ఎన్‌వో 0020974కు నేరుగా జయచేయవచ్చని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.చిన్న వెంకట్రావు,జిల్లా మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





రాజమహేంద్రవరంలో కలెక్టర్‌తో సెల్ఫీ

బడికి..పండగొచ్చింది!

అమ్మా..నాన్నా వచ్చారు.. అన్నీ తెలుసుకున్నారు..

- ఘనంగా మెగా పేరెంట్స్ మీట్
- 988 పాఠశాలల్లో నిర్వహణ
- తల్లులకు రంగవల్లుల పోటీలు
- తండ్రులకు టగ్ ఆఫ్ వార్
- ఉత్సాహంగా సాగిన మీటింగ్
- హాజరైన కలెక్టర్, అధికారులు
- బడిలోనే తల్లిదండ్రులకు విందు
- ప్రతి నెలా ఉండాలన్న పేరెంట్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పాఠశాలలకు పండుగొచ్చింది..జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులకు కొత్త కళొచ్చింది.. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' విజయవంతమైంది. పిల్లలు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు శనివారం అంతా కలిసి పండుగ చేసుకున్నారు. ఒకరి సమస్యలు ఒకరు చెప్పుకున్నారు.. ఒకరి సమస్యలు మరొకరు తెలుసుకున్నారు. తమ పిల్లలు పాఠశాలల్లో ఎలా ఉంటున్నారో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. మార్పు ఎలా తేవాలనే దానిపై ఇరువురూ కలిసి చర్చించుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నెలకో మారు ఇలా కలుసుకుంటుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 714 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 202 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 988 పాఠశాలలు సందడి మారాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆహ్వానం మేరకు తల్లిదండ్రులు /సంరక్షకులు పండుగకు భారీగా తరలివచ్చారు. బాలురు 49348, బాలికలు 54074 మంది..వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు,ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు సుమారు రూ. 3 లక్షల మంది వేడుకలకు హాజరయ్యారు. మీటింగ్ నిర్వహణకు ప్రభుత్వం రూ.23 లక్షల నిధులు విడుదల చేసింది. ప్రతి పాఠశాలలోనూ ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. పలు పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులకు రంగోళి పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ (తాడు లాగడం) పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. కొన్ని చోట్ల విద్యార్థులతో పాటలు పాడించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ , గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాల్సిన అవసరాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా విద్యార్థుల తల్లిదండ్రులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పాఠశాలలో ఆనందంగా గడిపారు. తమ పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఏం చేయా లో తెలుసుకున్నారు. పాఠశాలల్లో విందు ఆరగించి ఆనందంగా ఇళ్లకు వెళ్లారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జడ్పీ హైస్కూల్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి స్వయంగా భోజనం చేసి రుచిగా ఉండడంతో ఇద్దరు ఆయాలను మెచ్చుకుని.. వారికి మంచి చీరలు బహూకరించాలని డీఈవో వాసుదేవరావును ఆదేశించారు.లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లో జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు హాజరై చిన్నారులకు తమ అనుభవాలను అందించారు. బాగా చదువుకోవాలని సూచించారు. మేం బాగా చదువుకున్నాం కాబట్టే ఈ రోజు మీకు చెప్పగలిగే స్థాయికి ఎదిగామని.. మీరు కూడా మాలా ఎదగాలని సూచించారు.జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవోలు కృష్ణనాయక్,రాణి సుస్మిత, మండల స్థాయి అధికారులు తదితరులు హాజరయ్యారు. విద్యార్థులతో పాటు వారి తల్లులు ఎక్కువగా హాజరుకావడం గమనార్హం.



కొవ్వూరులో విద్యార్థుల తల్లులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇక నుంచి ప్రభుత్వ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డ్ : కలెక్టర్

కొవ్వూరు,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాల పరిస్థితులను, ఉపాధ్యాయుల పనితీరు అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజ నం చేశారు. చక్కగా వంట చేసిన మిడ్ డే మీల్ ఆయాలను ప్రశంసించి వారికి చీరలను బహూకరించారు. పిల్లల చదువులపై తల్లిదండ్రుల్లో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. చదువుతో పాటు వారి ప్రతిభను తెలియజేసే సమగ్ర ప్రగతి ప్రోగ్రెస్ కార్డు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.ఇంతవరకు ఈ విధా నం ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే ఉందన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పిల్లల ప్రతిభను గమనిస్తూ ప్రోగ్రెస్ కార్డులపై తల్లితండ్రులు సంతకాలు చేసి పంపించాలన్నారు. రెండు రోజులకోసారి భోజనంలో మెనూ మార్చాలని..పాఠశాలలో శిథిలావస్థకు చేరిన షెడ్డును తీసివేసి ఆటస్థలంగా మార్పు చేయాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు.ఆమె వెంట డీఈవో కె.వాసుదేవరావు,ఎంఈవో కె.రామకిషోర్, హెచ్ఎం టి.రామానుజం, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



లాలాచెరువు మునిసిపల్ పాఠశాలలో విద్యార్థుల ఆవిష్కరణలు తిలకిస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా..

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :ప్రతి విద్యార్థి పట్టుదలతో తాను ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థితికి చేరాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు మునిసిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంచడం చాలా ముఖ్యమన్నారు. తాను కూడా పదవ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లలోనూ ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నదని, తల్లిదండ్రులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా బోధన, ఇతర విషయాల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై తల్లిదండ్రులు అందించే సూచనలు కీలకపాత్రను పోషిస్తాయన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, నేరాల వైపు విద్యార్థుల దృష్టి మరలకుండా ఉపాధ్యాయు లు చూడాలన్నారు. ముందుగా జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ ప్రశాంతి తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.పేరెంట్స్‌కు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కే. ప్రకాష్‌బాబు,డీఈవో కె.వాసుదేవరావు, డీఐవో దిలీప్‌కుమార్, పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ కందికొండ రమేష్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ఆయాలకు చీరల బహుమానం.. కోరుకొండలో తల్లులకు గిఫ్ట్‌గా స్టీల్ బాక్సులు





రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు

గాలి..పీల్చలేం!

రాజమహేంద్రవరంలో వాయుకాలుష్యం

- నగరంలో కంపు..కంపు
- పేపరుమిల్లు గ్యాస్‌తో ఇక్కట్లు
- డంపింగ్‌యార్డుతో ఇబ్బంది
- రోగాలతో జనం సహవాసం
- పట్టించుకోని యంత్రాంగం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలను పట్టిపీడిస్తున్న భయంకరమైన సమస్య వాయు కాలుష్యం.రోజూ అలవాటుపడిన ప్రజలకు ఇది పెద్దగా పట్టకపోవచ్చుగాని కొత్తవారు వస్తే మాత్రం కడుపులోతిప్పి వాంతులు కావడం ఖాయం. ఐదు దశాబ్దాలుగా రాజమహేంద్రవరం పరిసర గ్రామాలను పేపరు మిల్లు కాలుష్యం వెంటాడుతోంది. పేపరు మిల్లు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించింది. అయితే అదే స్థాయిలో గోదావరి జల, వాయుకాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడేలా అనేక సమస్యలు సృష్టించింది .గతంలో మిల్లు కాలుష్యంపై ప్రజలు,ప్రజా సం ఘాలు తిరగబడితే జల కాలుష్యం కాకుండా నీటిని శుద్ధిచేసి నదిలోకి వదులుతున్నామని మిల్లు యాజమాన్యం చెప్పింది. అయినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. పదేళ్ల కిందట వరకు పేపరుమిల్లు నుంచి విడుదలయ్యే గ్యాస్‌తో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు.దీనిపై వ్యతిరేకత వ్యక్తం కావడంతో మిల్లులోపల ప్రత్యేక ప్లాంట్‌ను పెట్టి గ్యాస్ బయటకు విడుదల కాకుండా చర్యలు తీసుకున్నారు. కానీ గత కొంత కాలంగా మళ్లీ దుర్వాసనతో కూడిన గ్యాస్‌ను విడుదల చేస్తున్నారు. దీంతో ఆ వాసన పడక చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు ఇబ్బం దులు పడుతున్నారు. శ్వాసకోస, చర్మ, కంటి సం బంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. గోదావరి గాలి ఇసురును బట్టి నగరంతో పాటు చు ట్టుపక్కల కాతేరు, కొంతమూరు, కోలమూరు, లాలాచెరువు ప్రాంతాలకు వాసనపోతుంది. కోటి లింగాలపేట, పాత ఊటలంక, లూథర్ గిరి, శ్రీరామ్‌నగర్, లలితానగర్, ఎల్‌బీ శాస్త్రిరోడ్డు, మునిసిపల్ కాలనీ, రత్నంపేట,ఆర్‌అండ్‌బీ, వాంబేకాలనీ, ఇందిరా నగర్, ఆనంద్‌నగర్,క్వారీ సెంటర్ల వరకు గ్యాస్ వాసన కమ్ముతోంది.శ్వాసకోస సమస్యలు వస్తున్నాయి.

జఠిలంగా మారిన డంపింగ్ యార్డ్

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని వ్యర్థాలు, చెత్త, చెదారాలను కార్పొరేషన్ చెత్త తరలించే వాహనాల్లో స్థానిక లూథర్‌గిరి వెనుక ప్రాంతంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇక్కడ గత 12 ఏళ్లగా ప్రతిరోజు ఉత్పన్నమవు తున్న 167 మెట్రిక్ టన్నుల చెత్తను తీసుకువచ్చి నిల్వచేసి వాటిని దగ్ధం చేసేవారు.అయితే ఇక్కడ చెత్త గ్రేడింగ్ చేసి రీసైక్లింగ్‌కు తీసుకెళ్లే వాటిని ప్రత్యేకంగా వేరుచేయడం వంటి పనులకు షెడ్డు నిర్మించారు. అక్కడ దానిని చేర్చి ఉన్న పాత డంపింగ్ యార్డులో వ్యర్థాలు కుళ్లిపోయి భయంకరమైన దుర్వాసన వెదజల్లుతూ చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల వరకు దుర్వాసన వస్తోంది. ఈ డంపింగ్ యార్డును తరలించాలని గత పదే ళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.కానీ అది ఆచరణలోకి రాలేదు.ఈ వ్యర్థాలపై పందులు సంచరిస్తూ మరింత దుర్గంధభరితంగా మారుస్తున్నాయి. ఈ డంపింగ్ యార్డు ఒకప్పుడు ఊరి చివర ఉండేది కానీ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో ఇప్పుడు ఊరి మధ్యకు వచ్చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ వాంబేకాలనీ, శ్రీనగర్, మునిసిపల్ కాలనీ ప్రజలు తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.వర్షం పడితే సుమారు రెండు కిలోమీటర్ల మేర కంపు కొడుతుంది.ఈ వ్యర్థాలకు ఈగలు,దోమలు పెరిగి ఏడాది పొడవునా ఈ ప్రాంతంలో పిల్లలు జ్వ రాలు బారిన పడుతున్నారు.రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కాలుష్యం, డంపింగ్ యార్డు దుర్గంధం నడుమ ప్రజలు నలిగిపోతున్నారు.



భరించలేకపోతున్నాం..

అటు పేపరుమిల్లు, ఇటు డంపింగ్ యార్డు రెండింటికి మధ్యలో ఉన్నాం. పేపరుమిల్లు నుంచి మధ్యమధ్యలో గ్యాస్ విడుదలైనప్పుడు భరించలేని వాసన వస్తుంది.. కానీ ఎప్పుడు డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వస్తూనే వుంటుంది. దీని వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. - **అబ్రహాం, లూథర్‌గిరి**

వాసనొస్తే..అన్నం తినలేం

వాయు కాలుష్యం భరించలేకపోతున్నాం. పేపర్ మిల్లు నుంచి గ్యాస్ వాసన వస్తే ఆ రోజు అన్నం తినబుద్ధికాదు. మరొక పక్క కుళ్లిన వ్యర్థాలతో డంపింగ్ యార్డు నుంచి వాసన వస్తుంది.. డంపింగ్ యార్డు దగ్గరగా ఉండడంతో దోమలు పెరిగి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. **నాగేశ్వరరావు, పేపరుమిల్లు రోడ్డు ,రాజమహేంద్రవరం**

డంపింగ్ యార్డు, మిల్లుతో ముప్పు

లూథరగిరి వెనుక ఆర్‌అండ్‌బీ వాంబే కాలనీలో ఉంటున్నాం..మాకు దగ్గరలో డంపింగ్ యార్డు, కూతవేటు దూరంలో పేపరుమిల్లు ఉన్నాయి. ఈ రెండింటితో ఇబ్బందులు పడుతున్నాం. డంపింగ్‌యార్డ్ తరలించాలి..మిల్లు గ్యాస్ విడుదల నియంత్రించాలి. - **పేరూరి రాఘవ, ఆర్‌అండ్‌బీ వాంబే కాలనీ**

ఎలా బతకాలో అర్థంకావడంలేదు..

డంపింగ్ యార్డు, పేపరుమిల్లు, దోమలు బెడదతో సతమతమవుతున్నాం. సొంతిళ్లను వదిలిపోలేం. చాలా ఏళ్లగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎలా బతకాలో అర్థం కావడంలేదు. సమస్యలు పరిష్కరించండి - **సీహెచ్.రమణ, వాంబే కాలనీ**

డ్రగ్స్ రహిత ఏపీ సాధనకు కృషి

కొవ్వూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతిఒక్కరూ తోడ్పాటును అందించాలని కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో శనివారం కరస్పాండెంటు నెల్సన్ ఆంటోని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు రవాణ చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అటువంటి వారి వివరాలు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : మద్దిపాటి


ఎమ్మెల్యే మద్దిపాటిని సన్మానిస్తున్న సువర్ణరాజు

దేవరపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి తమ కలలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.శనివారం దేవరపల్లిలోని ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తాను సామాన్య కుటుంబం నుంచి ఈరోజు ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానంటే కష్టపడి చదవడమే కారణమన్నారు. జనసేన ఇన్‌చార్జి, కళాశాల కరస్పాండెంట్ డి.సువర్ణరాజు మాట్లాడుతూ 1994లో కళాశాల ఏర్పాటు చేశామని, 1200 మంది వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులకు ఎమ్మెల్యే వెంకట్రావు మెమెంటోలు అందజేయగా ఆయనకు సువర్ణరాజు మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీ చౌదరి, ఉప్పులూరి రాంబాబు, కాట్రు భీమరాజు, రొంగల సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరపల్లిలో విద్యుదాఘాతంతో ఒకరి మృతి



రామకృష్ణ మృతదేహం, ఫైల్‌ఫొటో

దేవరపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో విద్యుదాఘాతంతో శనివారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాకా రామకృష్ణ(40) దేవరపల్లిలోని కల్లూరి ఎంటర్ ప్రైజస్ తూర్ల తయారీ కంపెనీలో పని చేయడానికి వచ్చాడు. ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కు తగిలించే క్రమంలో ట్రక్కు ఒక్కసారిగా పైకి లేవడంతో విద్యుత్ తీగలు తగలడంతో రామకృష్ణ షాక్‌కు గురై కుప్ప కూలిపోయాడు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయం వద్ద మృతదేహం లభ్యం

కొవ్వూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టు దిగువన గండి పోచమ్మ ఆలయ భోజనశాలలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరి తెలిపారు. మృతుడిని తాళ్లపూడికి చెందిన మిద్దే రాంబాబు (45)గా పోలీసులు గుర్తించారు. ఒంటిపై సిమ్మెంటు కలర్ టీషర్ట్, నలుపు పసుపు రంగు కలిగిన చుక్కల లుంగీ తలకు మంకీ క్యాప్ ఉన్నాయన్నారు. ఆలయ ఈవో ఆంజనేయరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మృతికి సంబంధించి వివరాలు తెలియరాలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

క్రమశిక్షణతో చదవాలి

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకగా మెగా పేరెంట్స్ డే
- పలుచోట్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆటలపోటీలు

దేవరపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. పలు పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ డే సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గౌరీపట్నంలో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. దేవరపల్లిలో జరిగిన సమావేశంలో ఎంఈవో తిరుమలదాసు మాట్లాడుతూ మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో 3151 మంది విద్యార్థులున్నారని అన్నారు. అన్ని పాఠశాలల్లో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు. రామన్నపాలెంలో హెచ్‌ఎం పేరం రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి క్రీడాకారుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ప్రభు త్వ పాఠశాలల్లో ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉంటారని.. తల్లిదండ్రులు తమ చిన్ననాటి రోజులను గుర్తుచేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పలు పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ డే సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్, కుమారదేవం గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముప్పిడి ము ఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు బీఈడీ, ఎంఈడీ, పీజీలు చేసి డీఎస్సీలో మెరిట్ సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగాలు రాని వారు ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని, ఇది తల్లితండ్రులు గమనించాలన్నారు. కార్యక్రమాల్లో కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, ఎ.సత్యలక్ష్మి, వి.ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, టీడీపీ మండలాధ్య క్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని పాల్గొన్నారు. దొమ్మేరు పాఠశాలలో జరిగిన సమావేశానికి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విచ్చేశారు. కొవ్వూరు పట్టణ, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు.

తాళ్లపూడి: తాళ్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ గూడపాటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కనకం ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ సహకారాలు ఎంతో అవసరమన్నారు. మలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎస్‌ఐ రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి యాంటీ డ్రగ్స్‌పై పోస్టర్లు విడుదల చేశారు. అలాగే సెల్‌ఫోన్ వినియోగం, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ దవులూరి అబ్బులు పాల్గొన్నారు. అన్నదేవరపేట జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి హెడ్‌కానిస్టేబుల్ ముద్దయ్య విచ్చేసి పిల్లలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలను వివరించారు. విద్యార్థులకు సెల్‌ఫోన్ వినియోగం, పుస్తక పఠనంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మెగా మీట్ పేరుతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ చూపించాలన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనందించాలని, క్రమశిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశాల్లో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త హైస్కూల్లో జరిగిన సమావేశంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి కృషితో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. కార్యక్రమం లో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ, ఎంఈవోలు సక్సేనరాజు, శారదా జ్యోత్స్న పేరెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం, చివటం, వేలివెన్ను, సత్య వాడ, సూర్యారావుపాలెం, తాడిపర్రు హైస్కూళ్లతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఆత్మీ య సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

నల్లజర్ల: మండలంలోని ఆవపాడులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ విద్యార్థుల తల్లిదండ్రులకు హాట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. నల్లజర్ల జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పాల్గొన్నారు. చోడవరం జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం జీఎన్‌వీ రవికుమార్, ఎస్ఎంసీ ఛైర్మన్ పెసరగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చీపురుగూడెంలో ప్రధానోపాధ్యాయుడు కె.అప్పలచారి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

నిడదవోలు: పట్టణంలోని ఎస్‌కేఎఫ్‌బీ మున్సిపల్ ఉర్దు పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలకు సద్వినియోగపర్చుకుని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు, చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఎమ్ఎఫ్ రెహమాన్, ఎస్ఎంసీ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొవ్వూరులో తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


తాళ్లపూడిలో మాట్లాడుతున్న గూడపాటి శ్రీనివాస్


చాగల్లులో నాట్యం చేస్తున్న చిన్నారులు


గౌరీపట్నంలో ఆర్డీవో సుస్మిత బహుమతుల ప్రదానం


నిడదవోలులో మాట్లాడుతున్న గంగుల వెంకటలక్ష్మి


గోపాలపురంలో బాలికల నృత్య ప్రదర్శనలు


ఆవపాడులో తల్లిదండ్రులకు హాట్‌బాక్స్‌ల ప్రదానం


మోర్తలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

శివాలయంలో అన్నదానం

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని రావణబ్రహ్మ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు విశేషపూజలు చేశారు. గోరు వరలక్ష్మి, సాదా రామకృష్ణ ఫ్రెండ్స్, గొలగాబత్తుల చక్రవర్తిల సహకారంతో ఈ అన్నదానం చేశారు.

దీవించు.. సుబ్రహ్మణ్యేశ్వరా!

- పలుచోట్ల ఘనంగా షష్ఠి వేడుకలు
- ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు
- స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


చాగల్లులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను శనివారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు గోష్పాదక్షేత్రానికి చేరుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా సుందరేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అర్చకులు పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే సంస్కృత పాఠశాలలోని గోష్పదేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గోదావరి గట్టుపై సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన షష్ఠి ఉత్సవాల్లో వేకువజాము నుంచి భక్తులు లైన్‌లో బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి, సంస్కృత పాఠశాల గోష్పాదేశ్వరస్వామి ఆలయాల్లో రాత్రి శ్రీపుష్పయాగం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, కొత్తపల్లి, ఖండవల్లి, అన్నవరప్పాడు తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించి దైవదర్శనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్‌దీపాలు, పూల దండలతో అలంకరించారు.

చాగల్లు: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కలుగజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటం, భజన కార్యక్రమాలు, దుర్గమాత వేషధారణలో చిన్నారులు దుష్టసంహార నృత్యరూపకం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఊనగట్ల, చిక్కాల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లోను షష్ఠి వేడు కలు ఘనం జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీవీ సుబ్రహ్మణ్యం, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని మోర్త, సత్యవాడ, వేలివెన్ను, సూర్యారావుపాలెం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించారు.

నల్లజర్ల: మండలంలోని పోతవరం సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో జరిగిన షష్ఠి వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, పసుమర్తి ప్రభాకరావు, చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, బేతిన అనిల్, సురేష్, సింహ పాల్గొన్నారు. తెలికిచర్లలో జరిగిన కార్యక్రమంలో భీమవరం నుంచి వచ్చిన ఇస్కాన్ టెంపుల్ గురూజీ వంశీ కృష్ణ ప్రభు భక్తులకు ప్రవచనలు చెప్పారు. కార్యక్రమంలో కళ్యాణి ప్రసాద్, అప్పారావు, కంపన దుర్గారావు, రాధాకాంత, రుద్ర శ్రీను పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక సుబ్రహ్మణస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద కోలాటం, భజనలు, శూలాలు తదితర కార్యక్ర మాలు నిర్వహించారు. త్యాజంపూడి, దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో షష్ఠి వేడుకలు నిర్వహించారు.

గోపాలపురం: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ప్రధాన రహదారిపై సుమారు కిలో మీటరు దూరం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే చిన్నారులకు పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యుడు సుతాపల్లి రామకృష్ణ తెలిపారు.


పోతవరంలో సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి


కొవ్వూరులో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి


ఉండ్రాజవరంలో షష్ఠి వేడుకల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్


ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది ఎంపిక


ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కాలికట్‌లో ఈనెల 21 నుంచి 28 వరకూ జరిగే ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు 18మంది ఎంపికయ్యారని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. కళాశాల క్రీడామైదానంలో రెండు రోజులు జరిగిన అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో మంచి ప్రతిభ చూపిన 18 మంది క్రీడాకారులను కాలికట్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. అంతర కళాశాలల ఫుట్‌బాల్ టోర్నీలో కాకినాడ ఐడియల్ కాలేజ్ ప్రథమ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ద్వితీయ, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తృతీయ, కొయ్యలగూడెం ప్రకాష్ కళాశాల నాలుగో స్థానంలోని నిలిచినట్టు తెలిపారు.

రూ.5 కోట్ల ఆస్తిని అన్యాక్రాంతం చేసిన మాజీ ఎంపీ

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర నడిబొడ్డున ఉన్న గౌతమి కోఆపరేటివ్ సూపర్‌బజార్‌కు చెందిన రూ.5 కోట్లు విలువ చేసే ఆస్తిని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అక్రమంగా అన్యాక్రాంతం చేశారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాయలంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లుగా అధికార మదంతో మాజీ ఎంపీ భరత్‌రామ్ చేసిన అక్రమాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయన్నారు. రాజమహేంద్రవరం పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న గౌతమి సూపర్‌బజార్ భూమిని అక్రమంగా భరత్ రామ్ అన్యాక్రాంతం చేశాడన్నారు. 11ఏళ్లకు లీజు అగ్రిమెంట్‌ను ముడుపులు తీసుకుని 33 ఏళ్లకు సబ్ లీజుకు మార్చేశారన్నారు. లీజు విషయంలో మాట వినడం లేదని గౌతమి సూపర్‌బజార్ కార్యవర్గాన్ని సైతం అప్పట్లో రద్దుచేసి ఈ అక్రమానికి తెగబడ్డారన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారని చెప్పారు. నగరంలో జరిగిన పనులు, పార్కుల్లో అవినీతిపై విచారణ జరుగుతుందని..25 శాతం కమిషన్లు బయటకు తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, నక్కా దేవివరప్రసాద్, కిలపర్తి శ్రీను, బూరా రామచంద్రరావు, కరగాని వేణు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు హైవేపై ప్రమాదం

కొవ్వూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొవ్వూరులో జరిగింది. కొవ్వూరు ఎన్‌హెచ్ 16పై ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపంలో శనివారం రాత్రి 9:30 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. రాత్రి సమయం కావడంతో మృతదేహాన్ని ఎవ్వరూ గుర్తించకపోవడంతో దాని పైనుంచి అనేక వాహనాలు వెళ్లిపోవడంతో తునాతునకలై రోడ్డుపై మాంసం ముక్కలు ముక్కలుగా చల్లాచెదురుగా పడిపోయాయి. మాంసం ముద్దలు వద్ద ఉన్న బట్టలను బట్టి మృతుడు మగ మనిషిగా గుర్తించారు. మృతుడు యాచకుడై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సిఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న మృతదేహం ముక్కలను అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

దేవరపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం పేదలను అన్ని విధాల ఆదుకుంటుందని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో వైద్యఖర్చుల కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం అందజేశారు. బంధపురం గ్రామానికి చెందిన నాదేళ్ళ శ్రీనివాసరావుకు రూ.93,916, నాదేళ్ల సత్యవాణికి రూ.82,638, దుద్దుకూరు గ్రామానికి చెందిన చిటికెన సింహాద్రి అప్పన్నకు రూ.35,000సీఎం రిలీఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి ధనుంజయుడు, గడా మురళీఅజిత్‌కుమార్, ఆండ్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీ, కొయ్యలమూడి చినబాబు, కాట్రగడ్డ గాంధీ తదితరులుపాల్గొన్నారు.

భాషను ఆస్వాదించాలంటే సాహిత్యాన్ని ఉపయోగించాలి

నన్నయ వర్శిటీ డీన్ రమేష్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు భాషపై గొప్ప అనుభవాన్ని అందించాలంటే సాహిత్యాన్ని ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నన్నయ యూనివర్శిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్, డీన్ కేఎస్ రమేష్ అన్నారు. రాజమహేంద్రరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం 'ముద్రితం నుంచి మౌఖికం వరకూ భాష, సాహిత్యం యొక్క సమ్మేళనం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వివిధ యూనివర్శిటీలకు చెందిన ప్రొఫెసర్ టి.విశ్వనాథరావు, ప్రొఫెసర్ కాంతిమతి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆష్మాధమైల్ తదితరులు పాల్గొని భావ వ్యక్తీకరణ కోసం వాడుతున్న భాష గురించి, సాహిత్యం గురించి వివరించారు. కళాశాల ఇంగ్లీష్ విభాగం ఇన్‌ఛార్జి ఎం.శ్రీలక్ష్మి సదస్సు లక్ష్యాలను వివరించారు. సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ.రాజేశ్వరి, ప్రొఫెసర్ నాగభూషణం, నూజిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

తాళ్లపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం సమీపంలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.8,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనం కళాకేంద్రంలో శనివారం జరిగిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శివసాయి నృత్య కళాక్షేత్రం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఈ ప్రదర్శనలు జరిగాయి.

ముగిసిన ప్లాస్టిక్ సర్జరీ సదస్సు

జీజీహెచ్(కాకినాడ), డి సెంబరు 7(ఆంధ్రజ్యోతి): అ సోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ అస్థటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా (ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్)-2024 ఆధ్వర్యంలో కాకినాడలో మూడురోజులుగా జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు శనివారం ముగిసింది. ము గింపు వేడుకల్లో ముఖ్యఅతిథులుగా డీఎంఈ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మా ట్లాడుతూ వైద్య సదస్సులు, సెమినార్లలో పాల్గొనడం ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పు లకు అనుగుణంగా వైద్యులు వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ముందు కు సాగాలన్నారు. ఈ సదస్సుల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడం, మనం నేర్చుకున్న విషయాలను గ్రూపులో ఒకరికొకరు చర్చించుకోవడంతో కొత్త ఆవిష్కరణలకు వీలుంటుందన్నారు. ఈనెల 5న కెడావర్ శస్త్ర చికిత్స, ఫిల్లర్స్, బొటాక్స్, థ్రెడ్ లిఫ్ట్ తదితర వాటిపై ప్రదర్శన, డిమానిస్ట్రేషన్, 6, 7 తేదీల్లో ప్లాస్టిక్ సర్జరీల్లో వస్తున్న కొత్త పోకడలు, నూతన ఆవిష్కరణలపై సైంటిఫిక్ సెషన్లు నిర్వహించామని ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.రత్నభూషన్ తెలిపారు. ఈ సదస్సులో దేశంలో ఉన్న నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు హాజరై లైవ్‌గా మృతదేహాలపై శస్త్రచికిత్సలు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమం లో ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ ప్యాట్రిన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ప్రవీణ, కార్యదర్శి డాక్టర్ ఎన్.రాంబాబు, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.